# ప్రయోజనం

**శేషు**

కస్టమ్స్ క్లియర్ చేసి బయటికి నడచి వచ్చిన కామాక్షికి కొడుకు సుధీర్‌ని చూడగానే మొహం విప్పారింది. ఒక్కసారిగా తన అలసట మరిచిపోయింది.

“అమ్మా! బేగ్ ఇలా ఇయ్యి” తల్లి చేతినించి బేగ్ తీసుకున్నాడు సుధీర్. కొడుకునీ కోడలునీ నాలుగేళ్ల మనవడు రవిని చాలా రోజుల తర్వాత చూడ్డంతో కామాక్షి కళ్లు చెమర్చాయి. మనవడి ప్రక్కనే వెనక సీట్లో కూర్చొని విశ్రాంతిగా వెనక్కు వాలింది కామాక్షి. మెత్తని కారు వెల్వెట్ సీట్లని చేత్తో రాస్తుంటే ఎంతో హాయిగా అనిపించింది కామాక్షికి. ఇండియాలో ప్రయాణం చేసే బస్సులు, జనం, రద్దీ ఆమె కళ్లముందు కదిలాయి. అక్కడి ప్రయాణానికీ, ఇక్కడి ప్రయాణానికీ నక్కకీ నాగలోకానికీ ఉన్న తేడా వుందనిపించింది కామాక్షికి.

“అమ్మా! ప్రయాణం బాగా జరిగిందా?” అంటున్న సుధీర్‌కి

“అత్తయ్యగారిని కాస్సేపు రిలేక్సు కానివ్వండి” అంటూ బదులు ఇచ్చింది కోడలు సుజాత.

అందమైన రెండంతస్తుల ఇంటి డ్రైవ్‌వేలో కారు ఆపి తల్లిని దిగమన్నాడు సుధీర్. ఇంట్లోకి ప్రవేశించిన కామాక్షికి ఒక్కసారిగా మత్తు వచ్చింది. ఆ ఇల్లొక దేవేంద్రభవనంలా అనిపించింది ఆమె కళ్లకు. ఇంట్లోకి అడుగు పెట్టగానే పొడవైన హాల్‌వే సిరామిక్ టైల్సుతో అడుగు వేస్తే మాసిపోతుందేమో అన్నట్లుగ్గా వుంది. హాల్ మధ్యలో వున్న సర్క్యులర్ స్టెయిర్ కేస్ మీద ఎర్రని అందమైన కార్పెట్ వయ్యారంగా వంపులు తిరుగుతూ వుడెన్ రెయిలింగ్‌లోంచి తొంగి తొంగి చూస్తోంది. స్టెయిర్ కేస్ ప్రక్కనే సీలింగ్ మీద నుండి అందమైన క్రిష్టల్ షాండిలియర్ రకరకాల కాంతులు వెదజల్లుతూ వ్రేళ్లాడుతోంది. కొడుకు వెంటే లివింగ్ రూమ్‌లోకి నడిచి వెళ్లింది కామాక్షి. చిక్కని ఇండియన్ కార్పెట్ మీద వెల్వెట్ సోఫాలు అందంగా అమర్చి వున్నాయి. సోఫా సెట్ మధ్య వున్న గ్లాస్ బ్రాస్ టేబుల్ మీద వింత కాంతులీనుతూ క్రిష్టల్ యాష్ ట్రే పొందికగా అమర్చి వుంది. రూమ్‌కి రెండు మూలల్లో అందమైన లేపాక్షి శిల్పాలు వయ్యారంగా నిలబడి ఉన్నాయి. ఆ రూమ్‌లో కార్పెట్ మీద నడుస్తూంటే ఆమె కాళ్లు గిలిగింతలు పెడ్తున్నట్లుగ్గా ఫీలయింది. అలాంటి ఇంటిని కామాక్షి సినిమాలలో మాత్రమే చూసింది. కథలలోనూ, నవలల్లోనూ అలాంటి ఇంటి వర్ణనలు చదివింది కానీ కళ్లతో ఆమె ఎప్పుడూ చూడలేదు.

‘అబ్బాయి’ ఇవన్నీ నీ సొంతమేనా? లేకపోతే ఆఫీసు వాళ్లు ఇచ్చారా?” సందేహంగా కొడుని చూస్తూ అడిగింది కామాక్షి.

“అన్నీమనవేనమ్మా!” నవ్వుతూ బదులు చెప్పాడు సుధీర్.

“అత్తయ్యా! కాస్త బాదంఖీర్ త్రాగండి” అంటూ క్రిష్టల్ గ్లాస్‌తో ఖీర్ ఇచ్చింది సుజాత.

ఖీర్ తాగగానే కాస్త ఓపిక వచ్చింది కామాక్షికి. కొడుకు కోడళ్ల వెంటా, మనవడి వెంటా చిన్నపిల్లలా ఇల్లాంతా కలియ తిరిగి చూసింది కామాక్షి. కొడుకు ప్రయోజకత్వానికి, కొడుకు,కోడళ్ల ఆదరణకి ఆమె ఎంతో మురిసింది, తన అదృష్టానికి ఎంతో పొంగి పోయింది.

“అమ్మా! నేనూ సుజాత రెండు వారాలు శలవు పెట్టాము. నీకు ఈ చుట్టు ప్రక్కల చూడవలసిన ప్రదేశాలన్నీ చూపెడతాము. ఈ రెండు వారాల్లో నీకు ఇక్కడ బాగా అలవాటు పడుతుంది” తల్లికి ఇంకొంచెం నెయ్యి వేస్తూ అన్నాడు సుధీర్.

“ఏమిటమ్మాయ్! పెద్ద విందుభోజనంలా అన్నీ చేసావు” టేబుల్ మీదవున్న సిల్వర్ వేర్, క్రిష్టల్ వేర్, మధ్యలో అందంగా అమర్చిన గులాబీలూ పరికించి చూస్తూ అంది కామాక్షి

“మీరు మా దగ్గరకి రావడమే మాకు పెద్ద పండుగ అత్తయ్యా!” ఆప్యాయంగా అత్తగారిని చూస్తూ అంది సుజాత.

తృప్తిగా భోజనం ముగించి కోడలి వెనుకే తనకై కేటాయించబడిన తన రూమ్‌లోకి వెళ్లింది కామాక్షి.

చిక్కని డబుల్ బెడ్ మీద అందమైన గులాబీ రంగు బెడ్ స్ప్రెడ్ పరిచి వుంది. బెడ్‌కి ప్రక్కనే డ్రెస్సర్ వుంది. డ్రెస్సర్ మీద రామాయణం, భాగవతం, ఇంకా ఏవేవో తెలుగు నవలలు వున్నాయి. రూమ్‌కి ఒక మూలగా ఒక టేబుల్ మీద ఏనుగు దంతంతో చేయబడిన వెంకటేశ్వరస్వామి విగ్రహం వుంది. వెంకటేశ్వరస్వామి విగ్రహం ముందు వెలుగుతున్న అగరొత్తుల సువాసనతో రూమంతా నిండింది. తనకోసం ఆ రూమ్‌ని ఎంతో శ్రద్ధగా అమర్చిన కోడలికి మనస్సులోనే అభినందించింది కామాక్షి.


“మీ గదికీ, బాబు గదికీ మధ్య ఒక బాత్‌రూమ్ వుంది. మీకు ఏమి కావలసి వచ్చినా నన్ను లేపడానికి మొహమాట పడకండి అత్తయ్యా!” గదిలో వున్న సెంటర్‌లైట్ ఆఫ్ చేసి బెడ్ ప్రక్కనే వున్న నైట్ లైట్ ఆన్ చేసి బయటకు నడిచింది సుజాత.

**ఈ మంచం మీద పడుకోవచ్చు. ఇండియాలోలాగా మనవడితో బెడ్ షేర్ చేసుకుంటూ, వాడిచేత మధ్యలో తన్నులు తింటూ పడుకో అక్కరలేదు. ఎప్పుడు కావాలంటే అప్పుడు తన గదిలోకి వచ్చి పడుకోవచ్చు**

పక్కమీద బద్ధకంగా ఒరిగిన కామాక్షికి అంతా కలలా వుంది. తనకంటూ ప్రత్యేకంగా కేటాయింపబడిన గది ఎంతో శుభ్రంగా అందంగా, విశాలంగా వుంది. తనొక్కత్తే హాయిగా ఈ మంచం మీద పడుకోవచ్చు. ఇండియాలోలాగా మనవడితో బెడ్ షేర్ చేసుకుంటూ, వాడి చేత మధ్యలో తన్నులు తింటూ పడుకో అక్కరలేదు. ఎప్పుడు కావాలంటే అప్పుడు తన గదిలోకి వచ్చి ఏ పుస్తకమో చదువుకోవచ్చు. కాస్సేపు పడుకోవచ్చు. లేకపోతే తనకంటూ ప్రత్యేకంగా రూమ్‌లో వున్న టి.వి. చూడచ్చు. కోడలు సుజాత అన్ని పనులూ చురుగ్గా. తెలివిగా చేసుకొనే మనిషిలా వుంది. ఇండియాలో వున్న కోడలు సుశీలలాగా తనమీద ప్రతీపనికీ ఆధారపడదు. చుట్టుపక్కల అమ్మలక్కలు వచ్చి ఇండియాలోలాగా మధ్యాహ్నం నిద్ర చెడగొట్టరు. స్వర్గం లాంటి ఇంట్లో తన శేష జీవితాన్ని సుఖంగా గడపవచ్చు. సుధీర్ వాళ్లా ఇండియా వెళ్లినప్పుడే తను కూడా వెళ్లి అక్కడ వున్న కోడలినీ, కొడుకునీ, మనవణ్ణి చూడవచ్చు. ఇన్ని రోజులూ సుధీర్ వాళ్లా రమ్మన్నా కూడా రావడానికి భయపడిన తన తెలివి తక్కువ తనానికి నవ్వుకుంది కామాక్షి. తన అదృష్టానికీ, కొడుకు ఐశ్వర్యానికీ మురిసిపోతూ నిద్రలోకి జారింది కామాక్షి.

కాలచక్రంలో మూడునెలలు గిరగిరా తిరిగి పోయాయి కామాక్షికి. ఏకథాటిగా కురుస్తున్న స్నోని కిటికీలోంచి విసుగ్గా చూస్తోంది కామాక్షి. మొదటిసారిగా స్నో చూసినప్పుడు అదొక అద్భుతమైన, అపురూపమైన దృశ్యంలా అనిపించింది ఆమెకు. ఇప్పుడు మాత్రం ఆమె పాలిటి శాపంలా అనిపిస్తోంది. హాయిగా ఇండియాలోలాగా, చీర, మామూలు చెప్పులతో బయటకు వెళ్ళడానికి లేదు వింటర్ బూట్లు. బరువైన కోటుతో నడవడం తనకీ జన్మకి చేతగాదేమో! చాలా యాంత్రికంగా ఇక్కడ జీవితాలు గడుస్తాయనిపిస్తోంది ఆమెకి. కూర తరగడానికి ఒక మిషినూ...ఇక్కడి మనషులు బహుశా ఉద్యోగం చేసి డబ్బుసంపాదించే మిషనులు ఏమో!

తనకంటూ ఒక జీవితం లేనట్లుగా ప్రతీదానికీ కొడుకు,కోడళ్ల మీద ఆధారపడుతున్నట్లుగా ఫీలవుతోంది కామాక్షి. నోరు విప్పే అవసరం లేకుండానే అన్ని పనులూ రొటీన్‌లా జరిగిపోతాయి. కొడుకు చేసే పనులు కోడలు చేసే పనులు కోడలూ చకచకా చేసుకుపోతారు. సుజాత తనతో ఎంత చనువుగా వుందామని ప్రయత్నిస్తున్నా, తనే ఆమెకు దగ్గర కాలేకపోతోంది, బహుశా తమ మధ్య తగినన్ని కామన్ ఇంట్రెస్ట్‌లు లేకపోవడమే అందుకు కారణం. పెద్దకోడలుసుశీల పధ్నాలుగో ఏట కోడలిగా తన దగ్గరకి వచ్చింది. ప్రతీపనికీ, మంచి చెడ్డలకీ, కష్టసుఖాలకీ, తనకి నీడలా వుంటుంది.



పెద్దకోడలితో చెప్పుకుందుకు గంటల తరబడి కబుర్లు వుండేవి. "అత్తయ్యా"! అంటూ ప్రతీపనికి తనమీద ఆధారపడే సుశీల గుర్తురాగానే ఆమె మనస్సు విలవిల్లాడింది. మనవడు రవి ప్రేమగానే వుంటాడు. వాడు తెలుగులోనే మాట్లాడినా తనకి ఇంగ్లీషులోనే వినపడుంది. తెలుగులో ఏమన్నా చదువు చెబుదామనుకుంటే వాడికి అభిరుచి లేదు. రాము అలాకాదు. ఎన్ని పేచీలు పెట్టినా బామ్మచేత చక్కగా చదువు చెప్పించుకొనే వాడు. రాత్రిళ్ల నిద్రపట్టనప్పుడు ప్రక్కన పడుకున్న రాముని చూస్తేఎంతో ధైర్యంగా వుండేది. రాత్రేమన్నా పీడకలలు వస్తే బామ్మ గుండెల్లో మొహం దాచుకుని పడుకునేవాడు. మనవడు గుర్తు రాగానే కామాక్షి కళ్లలో నుండి జలజలా కన్నీళ్లు రాలాయి.

పెద్దాడు జగన్నాధం ఏం చేస్తున్నాడో? వాడి ఆఫీసులో సుధాకర్ కి పెళ్లి అయిందో లేదో! పాపం సుధాకర్ ప్రేమ వివాహానికి అతని తల్లితండ్రులు వప్పుకోవడం లేదు. పెద్దాడు ఎలా వున్నాడో ఆఫీసులో ఏం జరిగినా ఇంటికొచ్చి అమ్మకు చెప్పేవాడు. ప్రతీపనికీ పెద్దకోడలూ, కొడుకూ తన సలహా అడిగే వారు. సుధీర్ జగన్నాధానికి పూర్తిగా వ్యతిరేకం. ప్రేమ వుంది కానీ మితభాషి పైగా వీళ్ల సమస్యలు తనకి అర్థంకావు. ప్రతీపనీ సుధీర్ సుజాతతో సంప్రదించి చేస్తాడు. సుజాత కూడా అన్ని విధాలా సుధీర్ కి తగిన భార్య. వాళ్లిద్దరికి ఆడా,మగా పనులంటూ తేడా లేదు. నిజమైన స్త్రీ పురుష సమానత్వం వాళ్లిద్దరిలోనూ కనిపించింది కామాక్షికి. కొడుకూ కోడళ్లనీ, మనవడిని, వాళ్ళసంసారాన్నీ ఇంటినీ చూస్తే చాలా ముచ్చటగా వుంటుంది.

కానీ ఇంద్ర భవనం అంటూ పరవశించి ప్రశంసించిన ఈ ఇల్లు ఆమెకొక పంజరంలా అనిపిస్తోందిప్పుడు. తనకంటూ ప్రత్యేకించి తన వయస్సు స్నేహితులు లేరు. తనకంటూ ప్రత్యేకించి ఒక్కపనీ లేదు. సాయంకాలం కాగానే వెళ్లేందుకు ఒక గుడీ లేదు. చెవులారా పురాణం విందామంటే చెప్పేశాస్త్రిగారూ లేరు. ఒక్కమాటలో చెప్పాలంటే ఇక్కడి జీవితం ఒక త్రిశంకు స్వర్గం. ఏ సమస్యలూ లేని స్వర్గసుఖాలు ఇక్కడ లేవు. పూర్తిగా భూమి మీద లభ్యమయ్యే సహజమైన జీవన విధానం లేదు ఇక ఈ బంగారు పంజరంలో స్వేచ్ఛలేని పక్షిలా తన శేషజీవితం గడపలేదు. నలుగురితోనూ మంచి చెడ్డలూ,కష్టసుఖాలూ పంచుకోగలిగే ఇండియాలోని నిరాడంబరమైన మామూలు జీవన విధానమే తనకు తగినది. సుధీర్ తో వెంటనే తను వెళ్లిపోడానికి ఏర్పాట్లు చేయించాలి. ధనుర్మాసం నాటికి ఇంటికి చేరుకోగలిగితే బాగుండును. ప్రాతఃకాల సమయంలో తులసి కోట ముందు చలికి మెల్లిగా వణుకుతూ మంత్రాలని ఉచ్ఛరిస్తూపూలతో పూజచేస్తున్న దృశ్యం అపురూపంగా, మనోహరంగా ఆమె కళ్లముందు మెదిలింది. సంతోషంతోఆమె కళ్లు మెరిశాయి.

*